


అంతర్వేది ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష
భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించాలి
కలెక్టర్ హిమాన్షు శుక్లా - 7లో

ఇలాగైతే.. సిద్ధమయ్యేది ఎలా?



- ఎన్నికల వేళ హడావుడిగా డీఎస్సీ నోటిఫికేషన్
- వెనువెంటనే టెట్, డీఎస్సీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు
- ఎలా సమాయత్తం కావాలంటూ నిరుద్యోగుల ఆగ్రహం
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు రకాల పోస్టులపై అస్పష్టత

రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడంపై నిరుద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల కోసం అన్నట్టుగా అప్పటికప్పుడే టెట్, డీఎస్సీలను నిర్వహించాలనుకోవడం, సమాయత్తం కావడానికి సరైన సమయం ఇవ్వకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పోస్టులు కూడా ఆశించిన స్థాయిలో కాకుండా తక్కువగా ఉండడంపై నిరుద్యోగులు నిరాశగా ఉన్నారు.

(కాకినాడ రూరల్ -ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 23 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే చంద్రబాబు కేవలం 7,902 ఉద్యోగాలకు మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి విమర్శలు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ పెడతామని ఆయనే హామీ ఇచ్చారు. కానీ అది నెరవేర్చకపోగా నాలుగున్నరేళ్ల తర్వాత మినీ డీఎస్సీ ప్రకటించి ఊరుకున్నారు. పైగా ఎన్నికలకు వెళ్లేటప్పుడు ప్రతి పార్టీ తన మేనిఫెస్టో విడుదల చేస్తుందని, దానిలోని ప్రతి మాటను పార్టీ నిలబెట్టుకోవాలని, అలా కాకపోతే ఆ నాయకుడు పదవికి రాజీనామా చేసి ఇంటికి వెళ్లిపోయే పరిస్థితి తీసుకురావాలని విపక్ష నేత హోదాలో అప్పట్లో యువతను ఉద్దేశించి జగన్ అన్నారు. ఆయనకు ఇవేమీ వర్తించవా అని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు చెప్పిన మాటలకు, నేడు సీఎం జగన్ చేస్తున్న చేతలకు పొంతన లేకుండా పోయిందని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా ఒక్కసారి కూడా డీఎస్సీ నిర్వహించకుండా ఇప్పుడు ఎన్నికల వేళ హడావుడిగా నోటిఫికేషన్ ఇచ్చారని విమర్శిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం డీఎస్సీ-2014లో 10,313 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసింది. 2018లో 7,902 ఉపాధ్యాయ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి ఎంపిక ప్రక్రియ చేపట్టింది. కోర్టు కేసులతో పెండింగ్ పడడంతో వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిలో 7,254 ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసింది. డీఎస్సీ-2018పై ఎన్నికల సమయంలో విపక్ష నేతగా ఉన్న జగన్ విమర్శలు గుప్పించారు. పాఠశాల విద్యలో 23 వేల ఖాళీలున్నాయంటూ నిరుద్యోగులపై అప్పట్లో ప్రేమ కురిపించారు. కానీ సీఎంగా అధికారం చేపట్టాక ఉన్న పోస్టులను జీవో 117తో సర్దుబాటు చేయగా మరికొన్నింటిని రద్దు చేశారు. ప్రస్తుతం ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీకి తగినంత వ్యవధి ఇవ్వకుండా తక్కువ సమయంలో టెట్, డీఎస్సీలను నిర్వహించాలనుకోవడంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు పరీక్షలకు సిలబస్‌లు వేర్వేరు కావడంతో వాటి నిర్వహణ మధ్య కాస్త సమయం ఉండాలని కోరుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందన్న యోచనతో వెనువెంటనే టెట్, డీఎస్సీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుండడం పట్ల నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు.

ఒకేసారి రెండు పరీక్షల నిర్వహణ

టెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాత్రమే డీఎస్సీకి అర్హులు. ఉపాధ్యాయ నియామకాల్లో టెట్‌లో వచ్చిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. దీనివల్ల డీఎస్సీ అభ్యర్థులకు టెట్ అత్యంత కీలకం. టెట్‌కు ఈనెల 8 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా ఈ గడువు 18తో ముగియనుంది. దీనికి సంబంధించిన రాత పరీక్షలను ఈనెల 27 నుంచి మార్చి 9 వరకూ నిర్వహించనున్నారు. ఫలితాలను మార్చి 14న విడుదల చేస్తారు. మరుసటిరోజు అంటే మార్చి 15 నుంచే డీఎస్సీ పరీక్ష ప్రారంభం కానుంది. దీంతో ఒకేసారి రెండు పరీక్షలను రాసేందుకు ఎలా సిద్ధం కావాలో తెలియడంలేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా టెట్ ఫలితాలు వెలువడిన తర్వాత మాత్ర మే డీఎస్సీ పరీక్ష షెడ్యూల్ ఖరారు చేస్తారని, టెట్, డీఎస్సీ రెండింటి నిర్వహణ మధ్య కనీసం 40 రోజుల వ్యవధి ఉండాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.



జిల్లాలవారీగా సంప్రదింపులు ఏవీ

రాష్ట్రవ్యాప్తంగా 6100 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయగా వాటిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 392 ఉద్యోగాలుండగా ఎస్టీటీలు 108, స్కూల్ అసిస్టెంట్‌లు 182, టీజీటీలు 102 పోస్టులు ఉన్నాయి. జిల్లాలో పీజీటీ, ప్రిన్సిపాల్ పోస్టులు కూడా ఉండగా ఇవి ఎన్ని ఉన్నాయో నేటికీ స్పష్టత లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు సబ్జెక్టులవారీగా ఎన్ని ఉన్నాయో నోటిఫికేషన్‌లోగానీ, సంబంధిత వెబ్‌సైట్‌లోగానీ వివరాలను పొందుపరచలేదని, దీంతో తామంతా ఆందోళనకు గురవుతున్నామని నిరుద్యోగులు వాపోతున్నారు. సాధారణంగా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చే ముందు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి విద్యాశాఖలోని వివిధ విభాగాల్లో ఖాళీలను పంపించమని సంబంధిత విద్యాశాఖాధికారులను ఆదేశిస్తుంది. ఆ విధంగా అన్ని జిల్లాలనుంచి వచ్చిన ఖాళీలను కలిపి నోటిఫికేషన్ ఇస్తుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలలకు సంబంధించి ఎస్టీటీ 42, స్కూల్ అసిస్టెంట్ తెలుగు 44, హిందీ 7, ఇంగ్లీష్ 38, గణితం 15, పీఎస్ 4, బయోలాజికల్ సైన్స్ 15, సోషల్ స్టడీస్ 12, ఫిజికల్ ఎడ్యుకేషన్ 46 పోస్టులు ఉన్నట్టు సమాచారం. సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, ఏపీ రెసిడెన్షియల్ తదితర సొసైటీలకు సంబంధించిన పాఠశాలల టీజీటీ, పీజీటీ ఖాళీల వివరాలు తెలియాల్సి ఉంది.

మినీ డీఎస్సీ.. జగన్ మోసపూరిత చర్య : ఐవీ

అమలాపురం రూరల్ : ఐదేళ్ల తరువాత 6,100 ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం కేవలం ఇది ఎన్నికల ఎత్తుగడే. ఉపాధ్యాయ చరిత్రలో అతి తక్కువ సంఖ్యతో మినీ డీఎస్సీ ప్రకటించడం జగన్ మోసపూరిత చర్య. అలాగే ఆన్‌లైన్ పరీక్షా విధానం డీఎస్సీ ఉద్యోగార్థులకు తీవ్ర నష్టదాయకం. ఒక్కోరోజు ఒక్కో అభ్యర్థికి ఒక్కో ప్రశ్నపత్రంతో పరీక్షలు నిర్వహిస్తే కామన్ మెరిట్ ఎలా తీస్తారు. డీఎస్సీ అభ్యర్థులందరికీ ఒకే ప్రశ్నపత్రంతో ఒకేరోజు పరీక్ష నిర్వహించాలి. పాదయాత్రలో భాగంగా అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ వేస్తామని నమ్మించి జగన్ ఓట్లు వేయించుకుని తర్వాత మోహం చాటేసిన జగన్‌కు నిరుద్యోగులు త్వరలోనే బుద్ధి చెబుతారు. జగన్ పాలనలో 6,100 పోస్టులు అంటే మిగిలిన ఉపాధ్యాయ పోస్టులు రద్దు చేసినట్టా, లేదా ఈ పోస్టులు అవసరం లేదనుకుంటుందా అనేది స్పష్టంచేయాలి.

\- యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ), ఎమ్మెల్సీ



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందజేస్తున్న ఏపీ జేఏసీ జిల్లా నేతలు

మధ్యంతర భృతి 30 శాతం తక్షణం ప్రకటించాలి

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో నిరసనలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి14: గతేడాది జూలై 1 నుంచి 12వ పీఆర్సీ అమలుకావాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు పీఆర్సీలో పురోగతి లేనందున తక్షణం ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని డిమాండు చేస్తూ జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. అమలాపురం తాలూకా కేంద్రంలో బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో జేఏసీ తాలూకా అధ్యక్షుడు సీహెచ్ రాజశేఖర్, ఎస్టీయూ జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, ప్యాప్టో చైర్మన్ నాగిరెడ్డి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ధరలు విపరీతంగా పెరిగిపోయినందున మధ్యంతర భృతి ప్రకటించాలని, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయిన తరువాత ఉద్యోగులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలు తక్షణం పరిష్కరించాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్ల కోసం పార్టు ఫైనల్ దరఖాస్తులు చేసుకుని నెలలు గడిచిపోతున్నా ఇంత వరకు పెండింగులు చెల్లించడం లేదని ఆరోపించారు. ఉద్యోగుల టీఏ, డీఏ బకాయిలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం వాటిని విడుదల చేయాలని నినాదాలు చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పృథ్వీ శ్రీనివాస్, గౌడ్, గుప్తా, చంద్రకళ, వేమన సత్యనారాయణ, మునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తీర్థ మహోత్సవాల్లో దుకాణదారుల కోసం ముగ్గు వేసి కొలత కొలుస్తున్న పంచాయతీ సిబ్బంది

దుకాణం పెట్టాలంటే గజానికి రూ.200 కట్టాల్సిందే

అంతర్వేది, ఫిబ్రవరి14: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో దుకాణాలు వేసే ప్రాంతాల్లో గజానికి రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే తీర్థ మహోత్సవాలను వైభవంగా నిర్వహించాలని అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. తొక్కిసలాట జరగకుండా రథం తిరిగే ప్రదేశాల్లో కొన్నిచోట్ల దుకాణాలు లేకుండా చేయడంతో దుకాణదారులు బెంబేలెత్తుతున్నారు. అధికారుల ఆదేశాలతో దుకాణాలు వేసుకునే ప్రాంతాల్లో లైన్ ముగ్గు వేసేందుకు పంచాయతీ అధికారులు, సిబ్బంది సిద్ధమయ్యారు. తీర్థ మహోత్సవాల్లో ఇళ్ల ఎదురుగా ఉన్న ప్రదేశంలో గతంలో వారే దుకాణదారుల వద్ద తోచిన పన్ను ఇచ్చుకునేవారు. ఈ ఏడాది పంచాయతీ గజానికి రూ.200 వసూలు చేయడంతో దుకాణానికి రూ.8 వేలు కట్టడం భారం అవుతుందని దుకాణదారులు వాపోతున్నారు. ఇటు స్థలం యజమానులు, అటు దుకాణదారుల మధ్య పంచాయతీ అధికారులు పన్నుల రూపంలో చేతివాటం చూపిస్తున్నారు. దీనిపై అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయంటూ కొలతలు ప్రారంభించారు. ఈ వసూళ్ల విషయంలో పంచాయతీ తీరుపై పలువురు మండిపడుతున్నారు.



లక్కవరంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా, రాజోలు ఎమ్మెల్యే వరప్రసాదరావు

'దాతల సహకారం ప్రశంసనీయం'

సచివాలయ భవనాన్ని ప్రారంభించిన కలెక్టర్

మలికిపురం, ఫిబ్రవరి14: గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు దాతలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని కలెక్టర్ హిమాన్షుశుక్లా, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావులు అన్నారు. బుధవారం లక్కవరంలో గ్రామ సచివాలయం-2 నిర్మాణానికి మాజీ సర్పంచ్ ముదునూరి గుర్రాజు, వెంకటనర్సమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రసాదరాజు స్థలాన్ని సమకూర్చారు. ఈ స్థలంలో రూ.20 లక్షలతో నిర్మించిన భవనాన్ని వీరు ప్రారంభించారు. స్థలదాతను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, సర్పంచ్ కోట పుష్పకుమారి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, మట్టా శైలజ పాల్గొన్నారు.



మండపేటలో టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమంలో స్టేజ్ వేదికపై వేగుళ్లకు మైకు ఇవ్వకుండా లాగేసుకుంటున్న వైసీపీ నేతలు

టిడ్కో గృహాల పంపిణీలో ప్రొటోకాల్ రగడ

- ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ వాగ్వాదం
- సభలో నుంచి వెళ్లిపోయిన వేగుళ్ల

మండపేట, ఫిబ్రవరి14 : మండపేట పట్టణంలో బుధవారం జరిగిన టిడ్కో గృహాలు ఫేజ్-1లో లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించలేదంటూ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధికారులపై మండిపడ్డారు. పట్టణంలోని గొల్లపుంతకాలనీలో ఫేజ్-1లో మిగిలిన 1,068 గృహలను లబ్ధిదారులకు అందజేశారు. సభకు అధ్యక్షత వహించాల్సిన తనను కాదని చైర్‌పర్సన్‌కు అధ్యక్షత ఇవ్వడంపై ఎమ్మెల్యే వేగుళ్ల అధికారులను ప్రశ్నించారు. అలాగే శిలాఫలకంపై కిందన తన పేరు వేయడాన్ని నిరసించారు. దీంతో కొద్దిసేపు తర్జనభర్జన జరిగిన అనంతరం జిల్లా రైస్‌మిల్లర్స్ సంఘ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య జోక్యంచేసుకుని ఎమ్మెల్యే వేగుళ్ల, ఎమ్మెల్సీల మధ్య చోటు చేసుకున్న వాగ్వాదానికి స్వస్తిపలికి సభ సజావుగా నడిచేలా చూడాలని కోరడంతో ఎమ్మెల్యే శాంతించారు. అనంతరం చైర్‌పర్సన్ రాణి అధ్యక్షతన సభ నిర్వహించారు. సభలో ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడిన అనంతరం పోటాపోటీగా మైక్‌లో మాట్లాడేందుకు పలువురు పోటీపడడంతో ఎమ్మెల్సీ తోట కల్పించుకుని ఎమ్మెల్యే వేగుళ్ల చేతిలో మైక్‌ను లాక్కుని వైసీపీ నేత కర్రిపాపారాయుడు మాట్లాడేందుకు ఇచ్చారు. అసలు ప్రొటోకాల్ ప్రకారం పాపారాయుడుకు మాట్లాడేందుకు ఉన్న అర్హత ఏంటని వేగుళ్ల ప్రశ్నించారు. దాంతో నేతల మధ్య మళ్లీ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఇరుపార్టీల నేతల మధ్య మాటల యుద్ధం జరిగింది. వేగుళ్ల మాట్లాడిన అనంతరం జరిగిన పరిణామాల నడుమ పాపారాయుడు మాట్లాడే సమయంలో సభ నుంచి ఎమ్మెల్యే ఆగ్రహంతో ప్రజలకు అభివాదం చేసుకుంటూ వెళ్లిపోయారు. దాంతో అక్కడ ఉన్న పోలీసులు అవాక్కయ్యారు. ఇక్కడ చక్కగా ఇళ్ల పంపిణీ జరుగుతుంటే అడ్డుకునే కుట్రతో ప్రతిపక్షం ఇలా చేసిందని ఎమ్మెల్సీ తోట ఆరోపించారు. అపార్ట్‌మెంట్‌లో మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ రాము తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంల గోదాము పరిశీలిస్తున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

ఈవీఎంల భద్రత విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

ముమ్మిడివరం,ఫిబ్రవరి14: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల విషయంలో యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు సిబ్బందికి సూచించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్ల గోదాములను బుధవారం ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూం తాళాలను, సీలును, సీసీ కెమెరాల పరిశీలనను, రెవెన్యూ, ఎన్నికల అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు అయిన కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, ఓటరు వెరిఫైబుల్ పేపరు, ఆడిట్ ట్రయల్ యూనిట్ల భద్రత, పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం మార్గ నిర్దేశకాల ప్రకారం ప్రతీ నెల ఈవీఎంలు, వీవీ ప్యాట్లు గోదాములను క్షుణ్ణంగా తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో వీటిని క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట తహశీల్దార్ శ్రీనివాసనాయక్, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ తదితరులు ఉన్నారు.

ఆధునికత వైపు అడుగులు వేస్తున్న విజ్ఞానం

- శాస్త్ర సాంకేతిక రంగాలను కొత్త పుంతలు తొక్కించే ఆలోచనలు
- వినూత్న పరిశోధనలకు శ్రీకారం చుట్టిన పాఠశాల విద్యార్థులు
- విజయవంతంగా ఇన్‌స్పైర్ జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 14 : పురోగమిస్తున్న శాస్త్ర సాంకేతిక రంగాలను కొత్త పుంతలు తొక్కిస్తూ ఆధునికత వైపు విజ్ఞానాన్ని పరుగులు పెట్టిస్తూ కొంగొత్త పరిశోధనలకు పాఠశాల స్థాయి విద్యార్థులు శ్రీకారం చుట్టి అందరినీ అబ్బురపరిచారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఇన్‌స్పైర్ మనాక్ జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించి ఇన్‌స్పైర్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్న ఆలోచనలకు తరగతి గది వేదిక కావాలన్నారు. అత్యాధునిక డిజిటల్ టెక్నాలజీని సైతం విద్యార్థులు ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించి భవిష్యత్తు శాస్త్రవేత్తలు తామేనని రుజువు చేశారన్నారు. విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను అధికారులతో కలిసి మంత్రి వీక్షించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకత, వినూత్న ఆలోచనల సంస్కృతిని పెంపొందించడానికి నూతన ఆవిష్కరణలకు వేదికగా మలిచే కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. జిల్లాస్థాయి ప్రదర్శనలో 72 పాఠశాలల నుంచి విభిన్న ఆవిష్కరణలతో ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో చేసిన జ్యోతి ప్రజ్వలన అందరినీ ఆకట్టుకుంది. నీళ్లతో జ్యోతిని వెలిగించిన తీరును జిల్లా సైన్స్ అధికారి జీవీ సత్యసుబ్రహ్మణ్యం అందరికీ వివరించారు. సందిగ్ధత ఎక్కువ ఉన్న ద్రవాలు వాడినప్పుడు దీపాలు నీటిలో వెలిగించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు యిళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ), కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, డీఈవో ఎం.కమలకుమారి, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, హెచ్ఎం ఎస్.రాజరాజేశ్వరి, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు బొరుసు వీవీ సుబ్రహ్మం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబు, ఎంఈవో జి.సూర్యప్రకాశరావు, విత్తనాల శ్రీనివాస్, డాక్టర్ శర్మఆదితి, డాక్టర్ జీఎస్వీ ఎస్సార్ మూర్తి, ఎస్.తాతయ్యనాయుడు, పి.వీరవెంకట సుబ్బారావు పాల్గొన్నారు.



అమలాపురంలో ఇన్‌స్పైర్ లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

ఆరోగ్య పరిరక్షణ కోసం..



మానవాళితోపాటు భూసారాన్ని పరిరక్షించేందుకు అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు ఎస్.ప్రవీణ్, పి.కాసుబాబు, ఎం.పరమేష్‌లు గైడ్ టీచర్ భవానీ సహకారంతో 'ప్లాంటు గ్రోయింగ్ మెషీన్‌ను' రూపొందించారు. రైతులు అత్యధికంగా ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వల్ల ప్రజారోగ్యంతో పాటు భూసారం కూడా దెబ్బతింటుంది. దీన్ని అరికట్టేందుకు సోలార్ ప్యానల్స్ సహకారంతో ప్రత్యేక ప్లాంటిక్ యాప్ ద్వారా గ్రోయింగ్ మెషీన్ పనితీరును వివరించారు. తక్కువ మోతాదులో ఎరువులు, పురుగుమందులు వినియోగించడం ఎలాగో చేసి చూపించారు.

ఆరోగ్యంతో నీటి శుద్ధి



ఆరోగ్యంతో పాటు విద్యుత్ శక్తిని ఆదా చేయడంతో పాటు మంచినీటి శుద్ధిని చేసే ప్రాజెక్టు పరికరాన్ని రావులపాలెం శ్రీసిద్ధార్థ స్కూలు విద్యార్థి పీఎస్ మల్లికార్జున రెడ్డి, గైడ్ టీచర్ ఆర్.దుర్గారావుతో కలిసి పెడల్ పంపింగ్ పవర్ జనరేషన్ అండ్ వాటర్ ప్యూరిఫికేషన్ ప్రాజెక్టును రూపొందించారు. ఇంట్లోనే సైకిల్ తొక్కడం ద్వారా శక్తిని తయారుచేసి భద్రత పరచడంతోపాటు ఆ శక్తిని వినియోగించి నీటిని శుద్ధిచేసే విధానాన్ని వివరించారు.



ప్రమాదమని తెలిస్తే చాలు.. అలారం మోతే!

బ్యాంకులతోపాటు ఇతర ప్రధాన ప్రాంతాల్లో చిన్నపాటి ప్రమాదం సంభవించినా వెంటనే అప్రమత్తమై నివారణా చర్యలు చేపట్టడంతోపాటు చోరీలు అరికట్టేందుకు ఊబలంక ఎస్ఎంవీఆర్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.ప్రభు, గైడ్ టీచర్ చిట్టూరి విజయలక్ష్మి సహకారంతో బ్యాంకింగ్ సెక్యూరిటీ సిస్టమ్ యూజింగ్ జీఎస్ఎం ప్రాజెక్టును రూపొందించారు. సెన్సార్లను వినియోగించడం ద్వారా అగ్ని ప్రమాదాలు గుర్తించడంతోపాటు ఆ సంస్థల్లోకి అర్ధరాత్రి సమయాల్లో అపరిచిత వ్యక్తులొచ్చినా సెల్‌ఫోన్‌లో అలారం మోగుతుందని వివరించారు.



బస్‌కాంప్లెక్సు టెర్మినల్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి విశ్వరూప్, ఆర్టీసీ ఎండీ

విజయవాడ తరహాలో అత్యాధునిక వసతులతో

బస్‌కాంప్లెక్సు టెర్మినల్ నిర్మాణం : మంత్రి విశ్వరూప్

అమలాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విజయవాడ తరహాలో అత్యాధునిక వసతులతో జిల్లా కేంద్రమైన అమలాపురంలో నూతన ఆర్టీసీ బస్ కాంప్లెక్సు టెర్మినల్ నిర్మాణం చేపట్టినట్టు రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. అమలాపురం ఆర్టీసీ కాంప్లెక్సు ప్రాంగణంలో రూ.45 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న బస్ కాంప్లెక్సు టెర్మినల్‌కు బుధవారం మంత్రి విశ్వరూప్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకాతిరుమలరావు, జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.గోపీనాథ్‌రెడ్డిలు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ టెర్మినల్ నిర్మాణంలో భాగంగా తొలి దశలో రూ.5 కోట్ల నిధులు రాష్ట్ర రవాణాశాఖ ద్వారా కేటాయించామన్నారు. ప్రస్తుతం ఉన్న కాంప్లెక్సు భవనాన్ని తొలగించి దాన్ని స్థానే 24 ప్లాట్‌ఫారాలతోపాటు మూడు అంతస్తుల భవనాన్ని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించడం జరుగుతుందన్నారు. తొలి దశ నిర్మాణాన్ని తొమ్మిది నెలల కాలంలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎండీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ సమకాలిన పరిస్థితులకు అనుగుణంగా పైఅంతస్తులను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో టెండర్లు పిలిచి కమర్షియల్ బ్లాకులను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ), బొమ్మి ఇజ్రాయిల్, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఆర్వీఎస్ నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి జడ్పీటీసీ పందిరి శ్రీహరి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్‌ఖాదర్, డిపో మేనేజర్ సీహెచ్ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిస్పెన్సరీ ఏర్పాటుచేయాలి

ఆర్టీసీ కార్మికుల వైద్య సౌకర్యం నిమిత్తం జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఆర్టీసీ డిస్పెన్సరీని ఏర్పాటుచేయాలని ఏపీపీటీడీ యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు మంత్రి పినిపే విశ్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే దూర ప్రాంతాలకు అమలాపురం నుంచి సర్వీసులు ఉన్నప్పటికీ ముఖ్య పట్టణాలైన చెన్నై, బెంగళూరులకు అమలాపురం డిపో నుంచి బస్సులు లేవన్నారు. ఆయా ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సదుపాయాలు కల్పించాలని, ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేందుకు అమలాపురం డిపోలో పెట్రోలు బంకును ఏర్పాటు చేయాలని డిపో కార్యదర్శి బి.గణపతిరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కాంట్రాక్టరు సంస్థ నిర్ణయించిన వేతనాలు చెల్లించడం లేదని, నేరుగా బ్యాంకు ఖాతాలకు సంస్థ నిర్ణయించిన వేతనాలు జమచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్.సోమేశ్వరరావు, తదితరుల ఆధ్వర్యంలో ఎండీ ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందజేశారు.

మహాశివరాత్రి ఏర్పాట్లకు శ్రీకారం


పందిరి రాట ముహూర్తం చేస్తున్న దృశ్యం

పిఠాపురం, ఫిబ్రవరి 14: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఆలయంలోని రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ పులి నారాయణమూర్తి పందిరిరాట ముహూర్తం చేశారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో తెలిపారు.

వసంతపంచమి వేడుకలు

పాదగయ క్షేత్రంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. సరస్వతి దేవికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చుక్కలు చూపిస్తున్న వెల్లుల్లి

కిలో రూ.360 నుంచి రూ.400



సామర్లకోట, ఫిబ్రవరి 14: సామాన్యులకు ఉల్లిధరలు ఊరటనిస్తుంటే వెల్లుల్లి ధరలు మాత్రం చుక్కలు చూపిస్తున్నాయి. కొంతకాలంగా కిలో రూ. 20 నుంచి రూ. 35 వరకూ విక్రయించిన ఉల్లి ధరలు తగ్గుముఖం పడుతుంటే వెల్లుల్లి ధరలు మాత్రం రూ. 300 నుంచి రూ. 360 వరకూ పలుకుతుండగా మరీ ప్రత్యేక రకం వెల్లుల్లి మాత్రం బుధవారం సామర్లకోట, పెద్దాపురం మార్కెట్లలో కిలో రూ. 400 వరకూ పలికింది. గత నెల చివరి వరకూ కిలో వెల్లుల్లి రూ. 200 వరకూ విక్రయించగా ఒక్కసారిగా రూ 360 నుంచి రూ. 400 వరకూ అమాంతంగా పెరిగింది. దీంతో సామాన్యులే కాదు ధనికులు సైతం వామ్మో అంటున్నారు. సామాన్యులు వెల్లుల్లి మాట ఎత్తాలంటేనే భయపడిపోతున్నారు. రాబోయే వేసవిలో పచ్చడి పెట్టేందుకు ఎక్కువగా ఉపయోగించే వెల్లుల్లి ధర పెరగడంతో పచ్చడి ప్రియులకు ఆందోళన కలిగిస్తోంది. వెల్లుల్లి పంట ఈ ఏడాది బాగా తగ్గినట్లు హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. గత అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ బంగ్లాదేశ్‌తో పాటు ఉత్తరాది రాష్ట్రాలలో వరదలకు వెల్లుల్లి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తెలుగు రాష్ట్రాలలో ఈ పంట లేకపోవడం, దిగుమతులు తగ్గడంతో వెల్లుల్లికి సహజంగానే డిమాండ్ పెరిగింది. ఇదే పరిస్థితి కొనసాగితే ధర మరింత పైపైకి ఎగబాకే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

రత్నగిరిపై పలు అభివృద్ధి పనులకు ఆమోదం

- రూ.46.75 లక్షలతో సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవ పనులు
- రూ.25.50 లక్షలతో కోరుకొండ కల్యాణోత్సవ పనులు
- రత్నగిరిపై దాతలకు ప్రత్యేక సౌకర్యాల కల్పనకు గ్రీన్‌సిగ్నల్
- రూ.60 లక్షలతో కోరుకొండ మెట్లమార్గం అభివృద్ధి పనులపై చర్చ
- అంతరాలయ దర్శన టిక్కెట్ల రేట్లు మార్పు నిర్ణయం వాయిదా


పాలకమండలి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, ఫిబ్రవరి 14: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో పలు అభివృద్ధి పనులకు బుధవారం పాలకమండలి ఆమోదం తెలిపింది. ఛైర్మన్ ఐ.వి రోహిత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై సభ్యులు, ఈవోతో చర్చించి ఆమోదం తెలిపారు. ప్రధానంగా సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవాలకు వివిధ ప్రాంతాల్లో రంగులు, షామియానాలు ఏర్పాటు, విద్యుద్దీప అలంకరణలకు రూ.46.75 లక్షలతో తయారుచేసిన అంచనాలను ఆమోదించారు. స్వామివారి సన్నిధిలో అన్నదానం, వివిధ పథకాలకు విరాళం అందించిన దాతలకు ప్రత్యేక సౌకర్యాల కల్పనకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు విరాళమిచ్చిన వారికి 10 ఏళ్లపాటు ఏడాదిలో వారి కుటుంబసభ్యులకు రెండు పర్యాయాలు ప్రత్యేక దర్శనం, వసతి సౌకర్యం కల్పించాలని రూ.10లక్షల పైబడి విరాళమిచ్చే దాతలకు 15 ఏళ్ల పాటు సౌకర్యాలు కల్పించాలని వీరికి ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని నిర్ణయించారు. నూతనంగా తయారవుతున్న టేకు రథం నిలుపుప్రదేశం వీపీసీకి మార్చాలని తీర్మానించారు. రూ.26 లక్షలతో వనదుర్గ మార్గ్ వద్ద మట్టి పూడ్చి గాబియన్ వాల్ నిర్మాణం, రూ.6.30 లక్షలతో ఆదిశంకర్ మార్గ్ వద్ద డ్రైయిన్, కొండకు మధ్య మట్టిపూడ్చడం, సత్యగిరి నుంచి గిరి ప్రదక్షిణ రోడ్డు తాత్కాలికంగా నిలుపుదల చేసి రూ.4.50 లక్షలతో ఎర్త్ ఫిల్లింగ్, సత్యగిరి జంక్షన్ నుంచి హరిహరసదన్ కచ్చారోడ్డు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.9.50 లక్షలు, రూ.18 లక్షలతో ఇటీవల అన్నవరం దేవస్థానానికి అప్పగించిన కిర్లంపూడి సత్రం రంగులు, ఇతర అభివృద్ధి పనులకు, రూ.11.50 లక్షలతో సహజ వెనక భాగంలో నిర్మించిన డార్మెటరీకి మిగిలిన పనులు, రూ.8.50 లక్షలతో సత్యగిరిపై మూడో క్యాంటీన్ నిర్మాణ పనులు, రూ.13.50 లక్షలతో పశ్చిమరాజగోపురం వద్ద 30 వీఐపీ కూల్చిన ప్రదేశంలో రిటైనింగ్‌వాల్ నిర్మాణం, కొండ దిగువ రూ.17.50 లక్షలతో మహిళలకు మరుగుదొడ్లు, చైల్డ్‌లింక్ మెస్ ఏర్పాటు తదితర పనుల అంచనాలను ఆమోదించారు. ప్రసాద్ స్కీం నిధుల ద్వారా అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించగా ఆమోదించారు. రూ.40 లక్షలతో స్టెయిన్‌లెస్ స్టీల్ బెంచీలు, క్యూలైన్‌ల ఏర్పాటుకు అంగీకారం లభించింది. ప్రస్తుతం అమలవుతున్న రూ.300 అంతరాలయ టిక్కెట్ దర్శనం ధర మార్పుపై నిర్ణయాన్ని వచ్చే సమావేశానికి వాయిదా వేశారు. మార్చి 19 నుంచి 25 వరకు జరిగే కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలలో వివిధ పనులకు రూ.25.50 లక్షలు ఖర్చు చేసేందుకు ప్రతిపాదించగా ఆమోదం లభించింది. ఇటీవల పలు వ్యాపార లైసెన్స్ హక్కులకు నిర్వహించిన బహిరంగ వేలంలో హెచ్చుపాటలను, అభివృద్ధి పనులకు పిలిచిన టెండర్లలో లోయస్ట్ టెండర్లను ఆమోదించారు. సమావేశంలో ఈవో రామచంద్రమోహన్, సభ్యులు పేరూరి బద్రీనారాయణ, దోమాడ సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇర్రిపాకలో వైభవంగా

ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ


జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న నెహ్రూ, స్వామీజీలు

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి14: జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలోని ఏలేరు నది తీరాన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 12 ద్వాదశ జ్యోతిర్లింగాలకు జ్యోతుల నెహ్రూమణి దంపతులు, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతులు, సర్వారాయుడు, సునీత దంపతులచే యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకినాడ శ్రీ పీఠం పీఠాధిపతి స్వామి పరిపూర్ణానందస్వామి చేతుల మీదుగా ద్వాదశ జ్యోతిర్లింగ ప్రతిష్ఠట చేశారు. శ్రీ పీఠం పరిపూర్ణానంద స్వామి జ్యోతిర్లింగాలు ప్రతిష్ఠ చేసి జ్యోతుల నెహ్రూ, నవీన్ దంపతులచే శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ పీఠం పరిపూర్ణానంద స్వామి మాట్లాడుతూ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ ఎంతో విశిష్టమైనదన్నారు. నది ఒడ్డున సాక్షాత్తు మహా శివుడే కొలువైనట్లు ఉందన్నారు. ఇక నుంచి ప్రజా సందర్శనతో దివ్యక్షేత్రంగా ఈ జ్యోతిర్లింగాల ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ సాక్షాత్తు ఆ పరమశివుని ఆశీస్సులతోనే ఇంతని మహా కార్యక్రమాన్ని చేపట్టగలిగానని ఏలేరు నది పక్కన నిర్మించిన ఈ జ్యోతిర్లింగాల క్షేత్రాన్ని ప్రజలు నిత్యం సందర్శించుకునేందుకు అన్ని రకాల ఏర్పాట్లను చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి నిత్యం పండితులతో అభిషేక కార్యక్రమాలు జరిపించనున్నట్లు చెప్పారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ మార్చి మొదటి వారంలో ఈ మహాయజ్ఞం కార్యక్రమం పూర్తవుతుందన్నారు. భక్తులందరూ ఈ ద్వాదశ శివలింగాలను దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెలాఖరున జరిగే మహాకుంభాభిషేకంకు రాష్ట్రంలో నుంచి ప్రముఖులు వస్తారన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నవీన్ తెలిపారు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ, యనమల కృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, రాజప్ప తనయుడు రంగనాథ్, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, పేరాబత్తుల రాజశేఖర్, పెద్దాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు హాజరై జ్యోతిర్లింగాల దర్శనం చేసుకున్నారు. భక్తులు తరలి వచ్చి జ్యోతిర్లింగాల దర్శనం చేసుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

నకిలీ నెయ్యి తయారీ గుట్టురట్టు

- విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారుల సంయుక్త దాడులు
- రూ.7 లక్షల ముడి సరుకు సీజ్
- స్వీట్స్ తయారీ అనుమతులతో కల్తీ నెయ్యి తయారీ


బకెట్లలో నకిలీ నెయ్యి

అనపర్తి, ఫిబ్రవరి 14: మార్కెట్‌లో లభించే ఏ సరుకు కొనాలో, ఏది అసలో ఏది నకిలీనో తెలియని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మార్కెట్‌లో లభించే నెయ్యి కొంత తక్కువ ధరకు విక్రయించేందుకు ఒక వ్యాపారి నకిలీని ఎన్నుకున్నాడు. వెన్న లేకుండానే టన్నుల నెయ్యిని తయారు చేసి విక్రయాలు సాగిస్తున్నాడు. అనపర్తి మండలం పొలమూరులో వరి పొలాలకు ఆనుకుని గ్రామానికి చెందిన తమలంపూడి రాజారెడ్డి స్వీట్స్ తయారీ పేరుతో కార్ఖానా ఏర్పాటు చేసి రెండేళ్లుగా నకిలీ నెయ్యి తయారు చేస్తూ విక్రయాలు సాగిస్తున్నాడు. తయారు చేసిన కొంత భాగాన్ని ఒడిసాకు తరలిస్తుండగా కొంత భాగాన్ని ఇక్కడ రిటైల్ మార్కెట్‌లో విక్రయిస్తున్నాడు. మార్కెట్‌లో లభ్యమైన నకిలీ నెయ్యి డబ్బాపై ఎటువంటి నిర్దిష్టమైన ప్రచురణలు లేకపోవడంతో విజిలెన్స్ అధికారులు తయారీ కేంద్రంపై దృష్టి సారించారు. బుధవారం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నకిలీ నెయ్యి తయారీకి వినియోగించే సన్‌ఫ్లవర్ ఆయిల్, వనస్పతి, పామాయిల్, జాబిలాల సీడ్స్, ఆర్టిఫిషియల్ ఫ్లేవర్‌తో ధనేశ్వరి బ్రాండ్‌పై నకిలీ నెయ్యి తయారు చేస్తున్నట్టు గుర్తించారు. నకిలీ నెయ్యి తయారీకి వినియోగించే సుమారు రూ.7 లక్షల విలువైన ముడి సరుకును సీజ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ముత్యాల నాయుడు మాట్లాడుతూ నకిలీ నెయ్యి తయారీ చేస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. స్వీట్ తయారీ పేరుతో అనుమతులు తీసుకుని నకిలీ నెయ్యి తయారు చేస్తున్నట్లు గుర్తించామని, సుమారు టన్ను నకిలీ నెయ్యి స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సిద్ధి పేరుతో నకిలీ నెయ్యి తయారు చేస్తున్న రాజారెడ్డిపై కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. తయారీ కేంద్రంలో సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు తరలిస్తున్నామని నివేదిక ప్రకారం క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. జిల్లా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు మాట్లాడుతూ ప్యాకింగ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కాటాపై సీల్, ప్యాకింగ్‌పై కస్టమర్ కేర్ నెంబరు ముద్రించి ఉండాలని ఈ మూడు నిబంధనలను పాటించక పోవడంతో మూడు కేసులు నమోదు చేశామన్నారు. విజిలెన్స్ సీఐ నాగేంద్రకుమార్, ఎస్ఐ జగన్నాథరెడ్డి, డీటీ శశిధర్ పాల్గొన్నారు.

అంతర్వేది ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అంతర్వేది, ఫిబ్రవరి 14: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాల నిర్వహణపై కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం సమీక్షించారు. తొలుత ఆయన ఎస్పీ ఎస్.శ్రీధర్‌తో కలిసి కల్యాణ మండపం, రథోత్సవం, 16 స్తంభాల మండపం, షెడ్లు, బస్టాండు, తీర్థయాత్ర సందర్శకుల ప్రదేశాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది ఉత్సవాలను సమన్వయంతో ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో అధికారులందరూ భక్తిశ్రద్ధలతో విధులు నిర్వర్తిస్తూ సేవలందించాలన్నారు. ప్రధానంగా 19వ తేదీ రాత్రి 12.29 గంటలకు స్వామివారి కల్యాణం, 20వ తేదీ మధ్యాహ్నం రథోత్సవం, 24న చక్రస్నానం, 25వ తేదీ సాయంత్రం తెప్పోత్సవం వైభవంగా జరిగేలా చూడాలన్నారు. రథోత్సవం జరిగే ప్రాంతంలో ఎటువంటి దుకాణాలులేకుండా పోలీసులు, దేవదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు విశ్రమించేందుకు ఏర్పాటు చేసిన వసతులను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. శాఖల వారీగా అధికారులు తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ సంవత్సరం సుమారు 3 నుంచి 4లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారన్నారు. ఉత్సవాలు జరిగే ప్రాంతంలో మెరుగైన పారిశుధ్య చర్యలు చేపట్టారు. స్నానాలు చేసే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, వాచ్ టవర్లు, మైక్ సెట్‌లు, సముద్ర తీర ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలని, టాయిలెట్లను ప్రతి మూడుగంటలకొకసారి శుభ్రపరిచేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తెప్పోత్సవం జరిగే సమయానికి ఆలయ ప్రాంగణంలో ఉన్న చెరువులో నీటిని నింపాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. సముద్ర స్నానం చేసేటప్పుడు భక్తులు కెరటాల బారిన పడకుండా రక్షణకు గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. అత్యవసర సమయంలో వైద్యం అందించేందుకు ఆరు మెడికల్ క్యాంపులను, రెండు అంబులెన్సులను అందుబాటులో ఉంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం తగినన్ని బస్సులను అంతర్వేదికి నడపాలని ఆర్టీసీ అధికారులను కోరగా 120 బస్సులు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. నిర్విరామంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, స్వామివారి కల్యాణం జరిగే సమయంలో బ్యాకప్ కింద జనరేటర్లు అందుబాటులో ఉంచాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. పది రోజుల పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో మద్యం, మాంసం దుకాణాలు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెండు అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి బందోబస్తు కోసం వస్తున్న సిబ్బందికి, వైద్య సిబ్బందికి స్కూళ్లల్లో వసతి ఏర్పాటు చేయాలని విద్యాశాఖాధికారులకు సూచించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటున్న కారణంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం చుట్టుపక్కన ఉన్న హోటల్, లాడ్జిల్లో అధిక మొత్తంలో అద్దె వసూలు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని పర్యాటక శాఖ అధికారులకు సూచించారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ కల్యాణ మహోత్సవాల్లో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఐదు జిల్లాల నుంచి 1,600 మంది పోలీసు సిబ్బందిని తీసుకొస్తున్నామన్నారు. ట్రాఫిక్ సమస్యలు, తోపులాటలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని, వన్‌వే రూట్‌లో భక్తులు సురక్షితంగా వెళ్లాలన్నారు. రథోత్సవం రోజున రథం వెళ్లే ప్రాంతాల్లో షాపులకు అనుమతులు లేవన్నారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ కల్యాణోత్సవాలకు వచ్చే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతోందని, దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులంతా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వన్‌వే రూట్ ఉండడం వల్ల స్థానికంగా ఉన్న భక్తులు, వారి బంధువుల ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో ఉప కమిషనర్ విజయరాజు, జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

దళిత సర్పంచ్‌కు అవమానం

- సమాచారం ఇవ్వకుండానే పంచాయతీ సమావేశం
- కార్యాలయం ఎదుట సర్పంచ్ నిరసన


కార్యాలయం వద్ద ఆందోళన

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 14: పిఠాపురం మండలం నవఖండ్రవాడలో దళిత మహిళా సర్పంచ్‌కు అవమానం జరిగింది. తనకు సమాచారం ఇవ్వకుండానే పంచాయతీ సమావేశం నిర్వహించి తీర్మానాలు నమోదు చేయడంపై సర్పంచ్ నిరసనకు దిగారు. నవఖండ్రవాడ సర్పంచ్ బళ్ల రజనీవాణి వైసీపీలో జరుగుతున్న అవమానాలు భరించలేక కొంత కాలం క్రితం తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పటి నుంచి ఆమెకు అధికారులు నుంచి సహాయ నిరాకరణ ఎదురవుతున్నది. నవఖండ్రవాడ గ్రామపంచాయతీ సమావేశాన్ని ఈ నెల 8వ తేదీన ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి వార్డు సభ్యులు ఎవ్వరు హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా పడింది. తిరిగి బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. వార్డు సభ్యులందరికి నోటీసులు ఇచ్చి తనకు సమావేశం నోటీసు ఇవ్వలేదని సర్పంచ్ బళ్ల రజనీవాణి తెలిపారు. సర్పంచ్ హాజరు కాలేదని సాకు చూపించి అభివృద్ధి పనుల నిర్వహణకు గానూ విలేజీ లెవెల్ కమిటీ ఏర్పాటుకు సమావేశంలో తీర్మానం చేశారని చెప్పారు. దళిత సర్పంచ్ అయిన తనను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కావాలనే అవమానిస్తున్నారని ఆరోపిస్తూ అతనిపై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేసి విధులు నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ రజనీవాణి తన భర్తతో కలిసి పిఠాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం మధ్యాహ్నం ఆందోళనకు దిగారు. ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు ఆదేశాల మేరకు తనను పంచాయతీ కార్యదర్శితో పాటు అధికారులు అవమానానికి గురిచేస్తున్నారని సర్పంచ్ బళ్ల రజనీవాణి తెలిపారు. వార్డు సభ్యుల వద్ద పంచాయతీ రికార్డులు ఉంచి ఆ నెపం తనపై వేసి సర్పంచ్ పదవిని నుంచి తొలగించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రెండేళ్లుగా తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. దళిత సర్పంచ్ అయిన తనను వేధిస్తున్న పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసి అతనిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా సర్పంచ్ ఆరోపణలపై విచారణ జరుపుతామని ఎంపీడీవో చిన్నారావు తెలిపారు.


ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

21 మందికి గాయాలు..ఒకరి పరిస్థితి విషమం


సంఘటన స్థలంలో ప్రమాద దృశ్యం

తుని రూరల్, ఫిబ్రవరి 14: 16వ నెంబరు జాతీయ రహదారిపై తుని రూరల్ వి.కొత్తూరు కూడలి వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీ కొట్టిన ఘటనలో 21 మంది గాయాలపాలయ్యారు. రాజమహేంద్రవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అక్కడి నుంచి తునికి వచ్చే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. హైవే రోడ్డు నుంచి తుని సర్వీసు రోడ్డుకు మళ్లే క్రమంలో వి.కొత్తూరు కూడలి వద్ద బెంగాల్ నుంచి కేరళ వెళుతున్న లారీ ఆర్టీసీ బస్సును బలంగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో లారీ డ్రైవర్‌తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న 20 మంది గాయాలపాలయ్యారు. భారీ శబ్దంతో లారీ ఢీకొనడంతో ఒక్కసారిగా ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. రోదనలు మిన్నంటాయి. స్థానికులతో పాటు సమీప రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది హుటాహుటిన చేరుకుని బస్సులో ఇరుక్కున్న ప్రయాణికులను బయటకు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. గాయపడ్డ 21 మందిని 108లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కిర్లంపూడి మండలం వేలంకి గ్రామానికి చెందిన ఐతా అప్పలరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించారు. వివాహ శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో బస్సులో ప్రయాణిస్తున్న వారు శుభకార్యాలకు వెళుతున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. సంఘటన స్థలంతో పాటుగా ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని తహసీల్దార్ భరత్‌రెడ్డితో పాటు రూరల్ సీఐ పరామర్శించారు. రూరల్ ఎస్ఐ డి.రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సిద్ధి వినాయక ఆలయం కిటకిట


స్వామివారి వద్ద కలాలను ఉంచి పూజ

అయినవిల్లి, ఫిబ్రవరి 14: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం మాఘ పంచమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. గణపతి పూజ, సరస్వతి కల్పం, సరస్వతి మండపారాధన, సరస్వతి హోమం నిర్వహించారు. లక్ష కలాలను స్వామివారి పాదాల చెంతన ఉంచి పూజ చేశారు.

అన్నప్రసాద భవన నిర్మాణానికి రూ.10 లక్షలు


దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 14: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి బుధవారం నందిగామకు చెందిన కోవెలమూడి వెంకటనారాయణ వసంత సంధ్యారాణి దంపతులు రూ.10 లక్షలు విరాళం సమర్పించారు. మహారాజ పోషకులకు ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో మన్యం భాను, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, ఫిబ్రవరి 14: అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని విజయవాడకు చెందిన బండారు కృష్ణప్రసాద్-అరుణకుమారి దంపతులు కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. దాతను శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటాన్ని దేవస్థానం ఛైర్మన్ గుత్తుల నాగబాబు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు అందజేశారు.

ఐక్యతతో పనిచేస్తే కాంగ్రెస్ బలోపేతం

ఐదు జిల్లాల నేతలతో మాణిక్‌రాకూర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14: అందరు ఐక్యతతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి, ఎంపీ మాణిక్‌ఠాకూర్ సూచించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, భీమవరం, ఏలూరు, అమలాపురం జిల్లాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, నాయకులతో రాజమహేంద్రవరం పేపరుమిల్లు సమీపంలోని కృష్ణసాయి కల్యాణ మండపంలో బుధవారం సమావేశం నిర్వహించారు. సీడబ్ల్యూసీ సభ్యుడు రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరిగే ఎన్నికలకు బూత్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవడం, పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేసుకోవడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఏఐసీసీ సెక్రటరీ సీడీ మియ్యప్ప, ఏఐసీసీ శాశ్వత సభ్యుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ముళ్ళ మాధవ్, నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, రాజమహేంద్రవరం ఇన్‌చార్జి బోడా వెంకట్, అనపర్తి ఇన్‌చార్జి వడయార్, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు పాండురంగారావు, నర్సాపురం అధ్యక్షుడు నార్నిడి బాబ్జి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమావేశంలో ఘర్షణ

రాజమహేంద్రవరం ఇన్‌చార్జి బోడా వెంకట్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. నగరంలో ఇటీవల నిర్వహించిన ఒక కార్యక్రమానికి సంబంధించి అంశం అక్కడ లేవనెత్తడంతో బోడా వెంకట్, బాలేపల్లి మురళీధర్ కు మధ్య వాగ్వాదం జరిగింది. అది కాస్త ఘర్షణకు దారి తీసింది. ఈ సంఘటనలో బాలేపల్లి మురళీధర్ దవడకు గాయం కావడంతో వెంటనే కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు వైద్యచికిత్స అందించారు. తనపై బోడా వెంకట్ దాడి చేశాడని బాలేపల్లి మురళీధర్ ప్రభుత్వాసుపత్రి అవుట్ పోస్టులో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేశవరం వేదికపై వేగుళ్ల, తోట

కేశవరంలో గెలుపొందిన వారే ఎమ్మెల్యేగా నిలబడాలని ప్రతిన


మాట్లాడుతున్న తోట, వేగుళ్ల

మండపేట, ఫిబ్రవరి 14: మండపేటలో రాజకీయం వేడుక్కుతోంది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎన్నికలకు ముందే పోటీకి సై అంటే సై అంటున్నారు. ఇటీవల ఇద్దరు నేతలూ మండపేట మండలం కేశవరం గ్రామాన్ని యూనిట్ గా ఎంపిక చేసుకుని పోటీకి సిద్ధమని వేర్వేరుగా ప్రకటనలు చేశారు. దానికి కట్టుబడి ఉన్నామని బుధవారం ప్రకటించారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలోని ఎమ్మెల్సీ తోట చాంబర్‌లో ఇద్దరు నేతలూ కేశవరంలో జరిగే ఎన్నికకు సంబంధించి విధి విధానా లను రూపొందించి మీడియా సమక్షంలో ఎన్నిక నిర్వహించాలని సూచించారు. ఇద్దరం పోటీకి సిద్ధమని... కేశవరంలో ఎవరు ప్రజా బలంతో గెలుపొందితే వారే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయాలని, ఈ విషయాన్ని తమ పార్టీ నేతలతో ప్రకటన చేయిస్తామని వెల్లడించారు. నియోజకవర్గంలో 42 గ్రామాలు, మున్సిపాలిటీ ఉండగా కేవలం కేశవరాన్నే ఎందుకు ఎంచుకున్నారని విలేకరులు ప్రశ్నించారు. గత మూడు ఎన్నికల నుంచి అక్కడ టీడీపీకి మెజారిటీ వచ్చిందని... అక్కడ తాను అవినీతికి పాల్పడ్డానని ఎమ్మెల్యే వేగుళ్ల వ్యాఖ్యానించిన నేపథ్యంలో తాను కేశవరంలో ప్రజా తీర్పు కోరుకుంటున్నానని తోట చెప్పారు. అక్కడి ప్రజలు ఇచ్చే తీర్పునకు తామిద్దరం కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఎప్పుడు పోటీ నిర్వహించాలో తర్వాత వెల్లడిస్తామన్నారు.


ఆత్రేయపురం మండలం ర్యాలిలో సామూహిక అక్షరాభ్యాసం

ఘనంగా వసంత పంచమి

ఆత్రేయపురం, ఫిబ్రవరి 14: వసంత పంచమి సందర్భంగా మండలంలోని ర్యాలిలో అర్చకుడు ప్రసాద్ సరస్వతీ పూజ జరిపి చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులకు పుస్తకాలు, పెన్నులను దాత సోమి రెడ్డి అందజేశారు. చింతా శ్యామ్, మోహిత్ పాల్గొన్నారు. ఆత్రేయపురంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.

కొత్తపేట: మందపల్లిలోని ఉమామందేశ్వరస్వామి ఆలయంలో ఉచిత సామూహిక సరస్వతీదేవి పూజ, అక్షరభ్యాసాలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనరు, ఈవో కె.విజయలక్ష్మి, సాధు చెంచయ్య, గ్రంధి చంద్రరావు, అడపా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కొత్తపేట విద్యాబాలమందిర్‌లో విద్యార్థులు సరస్వతీ పూజ జరిపారు. కరస్పాండెంట్ అనురాధ, హెచ్‌ఎం నూకపెయ్యి శివ రత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. వారికి పుస్తకాలు, పలకలు, పెన్నులు, పూజ సామగ్రితో పాటు బాసర జ్ఞాన సరస్వతి ఆలయం నుంచి వచ్చిన కుంకుమను అందజేశారు. కార్యక్రమంలో మన్యం పర్వతవర్ధనరావు, కొవ్వూరి వివేకానందరెడ్డిలతో పాటు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

శారదాదేవికి ప్రత్యేక అలంకరణ



యానాం: వసంత పంచమి సందర్భంగా గోపాల్‌నగర్‌లోని శారదాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. సామూహిక అక్షరాభ్యాసాలు జరిపారు. మెట్టకుర్రులోని జవహర్ నవోదయ విద్యాలయలో సరస్వతీదేవి చిత్రపటానికి ప్రిన్సిపల్ టీవీఎస్ ప్రకాశరావు పూజ చేశారు. సీబీఎస్ఈ పరీక్ష హాల్ టికెట్లను విద్యార్థులకు అందజేశారు. రీజెన్సీ పాఠశాలలో హెచ్‌ఎం టీఎస్‌వీఎస్ ప్రసాదరావు నేతృత్వంలో పాఠశాల ప్రాంగణంలో వున్న వాగ్దేవి విగ్రహానికి అర్చన, అభిషేకం జరిపారు.

మీసాల వేణుగోపాలస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ



ఆత్రేయపురం, ఫిబ్రవరి 14: మండలంలోని పులిదిండిలో రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి విగ్రహాలు, ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ బుధవారం కన్నుల పండువగా జరిగింది. వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు కనుమూరి శ్రీనివాసరాజు, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. వేలాది మందికి అన్నసమారాధన చేశారు.

కె.గంగవరం: ఆసరా చెక్కుల పంపిణీపై ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్య దర్శులు, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం కె.గంగవరం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేస్తామని చెప్పారు.





ముమ్మిడివరంలో తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు, పక్కన కొత్తపేటలో ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 14: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండు చేశారు. ముమ్మిడివరం తాలూకా పరిధిలోని వారంతా ర్యాలీగాతరలివచ్చి జేఏసీ అధ్యక్షుడు సుంకర శ్రీహరి ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15, 16 తేదీల్లో మధ్యాహ్న భోజన విరామసమయంలో నిరసన ప్రదర్శన, 17వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ధర్నా, ర్యాలీ నిర్వహించాలని తీర్మానించామన్నారు. కోలా కృష్ణ, జనిపల్లి సత్యనారాయణ, రెడ్డి వీరాస్వామి, వి.బాబాయ్, బీర కృష్ణమూర్తి, శీలారపు శ్రీనివాసరావు, పి.హిమబిందు, పెదపూడి రామదాసు, సీహెచ్ తిరుపతిరావు, కె.మన్యం, పెదపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట, ఫిబ్రవరి 14: ప్రభుత్వం ఉద్యోగుల ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఉద్యోగ జేఏసీ మండల చైర్మన్ ఎం.రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఉద్యోగ సంఘాల నేతలు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీగా వెళ్లి ఆర్డీవో జీవీవీ సత్యనారాయణకు మెమోరాండం అందించారు. తహసీల్దారు ఎలీషాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కేవీసీహెచ్ సూర్యారావు, ఎ.రామచంద్రప్రసాద్, వైసత్తిరాజు, ఎం.అరుణ, ఎన్వీ రామారావు, వై.మురళి, డి.శేషగిరిరావు, టి.విజయకృష్ణ, జి.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసన


గడియార స్తంభం సెంటర్లో ధర్నా చేస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 14: రైతులపట్ల కేంద్ర ప్రభుత్వం అత్యంత నీచంగా ప్రవర్తిస్తున్న తీరుకు రైతు, కార్మిక, ప్రజాసంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్లో నిరసన తెలిపారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, నాయకులు పెద్దిరెడ్డి రాము, గెడ్డం ప్రభాకరరావు, చెల్లుబోయిన తాతారావు, నిమ్మకాయల శ్రీను, కె.రామకృష్ణ, జంపన ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కార్మిక చట్టాలను రద్దుచేసి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్త బంద్‌కు పిలుపు ఇచ్చామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు పేర్కొన్నారు. వడ్డిగూడెంలోని కార్మిక సంఘ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మాట్లాడారు. దేశవ్యాప్త బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. రైతుల రుణాలను మాఫీ చేయాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, ఆహార భద్రతా చట్టాన్ని పటిష్టపరచాలని డిమాండు చేశారు.



పుల్వామా అమరవీరులకు నివాళి

మామిడికుదురు, ఫిబ్రవరి 14: పుల్వామాలో జరిగిన ఉగ్ర దాడుల్లో అశువులు బాసిన వీరులకు మామిడికుదురు దీప్తి స్కూలు విద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. పుల్వామా దాడి ఘటనను విద్యార్థులకు కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ వివరించి వారి త్యాగ నిరతిని కొనియాడారు.

అమలాపురం టౌన్: పుల్వామా దాడిలో అమరులైన జవానులకు భారతీయ జనతా యువమోర్చా జిల్లా శాఖ అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అమలాపురం గడియార స్తంభం సెంటర్లో నివాళులర్పించారు. బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, దూరిరాజేష్, జగతా శాంతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన కూటమితోనే యువతకు ఉపాధి

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 14: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని టీడీపీ సీనియర్ నాయకుడు పోతుల సుభాష్‌చంద్రబోస్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జనుపల్లిలో యువతతో సమావేశం నిర్వహించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నాయకత్వాలను బలపరిచి లక్ష్య సాధనకు ముందుకు సాగాలన్నారు. బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ ద్వారా నిరుద్యోగ భృతి చెల్లించడమే కాకుండా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

20 గ్రాముల బంగారం, రూ.20వేలు నగదు చోరీ

మండపేట, ఫిబ్రవరి 14: పట్టణంలోని విజయలక్ష్మి నగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగింది. రామచంద్ర పురం డీఎస్పీ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... సుధాతిరుమల అపార్ట్‌మెంట్‌లోని 3వ అంతస్తులో రెడ్డి వీర వెంకట సత్యనారాయణ అద్దెకు ఉంటున్నాడు. ఆయన ఈనెల 11న ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. బుధవారం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తలుపు తాళం బద్దలుకొట్టి కనిపించింది. గుర్తు తెలియని వ్యక్తులు 30 గ్రాముల బంగారం, రూ.20వేలు నగదు చోరీకి గురైనట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. సంఘటనా ప్రదేశానికి క్లూస్‌టీం వచ్చి పరిశీలించింది. దీంతో అపార్ట్‌మెంట్‌వాసులు ఉలిక్కిపడ్డారు. ఇదే అపార్ట్‌మెంట్‌లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుతో పాటు పలువురు ప్రముఖులు ఉంటున్నారు. బాధితుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను పరిశీలించిన డీఎంహెచ్‌వో

అంతర్వేది, ఫిబ్రవరి 14: సఖినేటిపల్లి మండలంలోని సఖినేటిపల్లి, రామేశ్వరం, మోరి ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర బుధవారం పరిశీలించారు. రామేశ్వరం పీహెచ్‌సీలో వైద్యాధికారులతో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు.

సంజీవయ్య 102వ జయంతి

అంతర్వేది, ఫిబ్రవరి 14: సఖినేటిపల్లిలో సంజీవయ్య 102వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు నివాళులర్పించారు. మోరి మహిమ సీపీసీ కార్యాలయంలో సమిష్టి వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో సంజీవయ్య జయంతి నిర్వహించారు.

ఎమ్మెల్యే రాపాక పూజలు

అంతర్వేది, ఫిబ్రవరి 14: వైసీపీ రాజోలు అసెంబ్లీ సీటు ఖరారైందన్న సమాచారంతో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు బుధవారం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అంతర్వేది దేవస్థానం పంచాయతీ పరిధిలో ప్రచారం చేశారు.

భవనాల ప్రారంభం

అల్లవరం, ఫిబ్రవరి 14: దేవగుప్తం హైస్కూలు వద్ద అదనపు భవనం, సచివాలయాలను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించారు. ఎస్.పల్లిపాలెంలో మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, జున్నూరి రామారావు, సాధనాల వెంకట్రావు, కొల్లు వెంకటరమణ, తిక్కా వెంకటప్రసాద్, గుంటూరి బాలరాజు, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, తహసీల్దారు సునీల్‌కుమార్, సాధనాల శ్రీను, ఎంపీటీసీలు ముత్తాబత్తుల రాంబాబు, మాకే కృష్ణమూర్తి పాల్గొన్నారు.


సీఎం జగన్ నుంచి కప్ అందుకుంటున్న డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి, క్రీడాకారులు

'క్రీడాకారులను కబడ్డీలో తీర్చుదిద్దుతాం'

రావులపాలెం, ఫిబ్రవరి 14: కబడ్డీ క్రీడాకారులకు తమ అసోసియేషన్ ద్వారా మరింత తర్ఫీదు ఇచ్చి తీర్చుదిద్దుతామని కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి (విక్టరీ వెంకటరెడ్డి) పేర్కొన్నారు. విశాఖపట్నంలో జరిగిన 'ఆడుదాం... ఆంధ్రా' క్రీడోత్సవాల్లో కబడ్డీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు క్రీడాకారులను అభినందించారు. లాంగ్‌టర్మ్ కోచింగ్‌లో భాగంగా ప్రో కబడ్డీ క్యాంపునకు సుమన్, బాలకృష్ణరెడ్డిలను, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కోచింగ్ క్యాంపునకు సంధ్య, సతీష్‌లను అప్పగించారు. కార్యక్రమంలో ఆంధ్రా అసోసియేషన్ సెక్రటరీ శ్రీకాంత్, విశాఖ సెక్రటరీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


డ్రైవరుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి నాగేశ్వరరావు

ముగిసిన రహదారి భద్రతా మాసోత్సవాలు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 14: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సభను జిల్లా ప్రజా రవాణాధికారి ఆర్వీఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అమలాపురం గ్యారేజీలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగాహాజరైన మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్ మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తతో డ్రైవింగ్ చేయాలన్నారు. విశ్రాంత మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వైఎస్ మూర్తి ట్రాఫిక్ రూల్స్ వివరించారు. డ్రైవర్లు ఆరోగ్యవంతంగా ఉంటూ దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో ముగ్గురు ఉత్తమ యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లు, డిపో స్థాయిలో 12మంది డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. రోడ్డు భద్రతపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 11మంది విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అమలాపురం, రాజోలు, రామచంద్రపురం డిపోల మేనేజర్లు సీహెచ్ఎస్ఎన్ మూర్తి, భాస్కరరావు, కె.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

రాయవరం, ఫిబ్రవరి 14: మండలంలోని సోమేశ్వరం గ్రామ శివారులో పేకాట శిబిరంపై రాయవరం ఎస్ఐ జి.నరేష్ దాడి చేశారు. పది మంది పేకాటరాయుళ్లతో పాటు వారి వద్ద నుంచి రూ.4,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. పది మందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 14: కామనగరువు హైవే సమీపంలోని ప్రధాన మురుగు కాల్వలో 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్నిబుధవారం గుర్తించినట్టు తాలూకా పోలీసులు తెలిపారు. ఊరు, పేరు తెలియని మృతదేహం బాగా ఉబ్బి దుర్వాసన వస్తున్నట్టు అందిన ఫిర్యాదుపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముదురు నీలం టీషర్టు, నలుపురంగు నిక్కరుతో ఉన్న ఆ వ్యక్తి సమాచారం తెలిసిన వారు తాలూకా ఎస్ఐ 9440796562 నెంబరుకు ఫోను చేయాలని కోరారు.

వాడివేడిగా మండపేట కౌన్సిల్ సమావేశం



మండపేట, ఫిబ్రవరి 14: మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం సాయంత్రం వాడి వేడిగా సాగింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధంతో పాటు ఎమ్మెల్యే వేగుళ్ల, ఎమ్మెల్సీ తోట మధ్య మాటల తూటాలు పేలాయి. చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్ఐ, ఇద్దరు పోలీసులు కూడా వచ్చి కూర్చున్నారు. జిల్లా అధికారులు ఆదేశాల మేరకే వచ్చామని వారు నేతలకు సమాధానమిచ్చారు. మండపేట నియోజకవర్గానికి విద్యుత్ పనుల కోసం రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇటీవల ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. అదే విషయాన్ని వేగుళ్ల సమావేశంలో ప్రస్తావించారు. అందులో మండపేట పట్టణానికి మంజూరైన నిధుల వివరాలతో పాటు సంబంధిత జీవోను చూపించాలని చైర్‌పర్సన్ ద్వారా ఎమ్మెల్సీ తోటను కోరారు. దీనిపై త్రిమూర్తులు మాట్లాడుతూ.... తాను మంజూరు చేయించిన నిధులకు చైర్‌పర్సన్ ఎలా సమాధానం చెప్తారని వేగుళ్లను ప్రశ్నించారు. నిధుల వివరాలను ప్రజలకు చెప్తాను తప్ప వేగుళ్లకు చెప్పాల్సిన అవసరం లేదనడంతో ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగింది. విద్యుత్ నిధులు కేవలం రూ.1.25 కోట్లు మాత్రమే మంజూరైనట్టు తెలిసిందని వేగుళ్ల చెప్పారు.

పట్టణంలో జాతీయ నాయకులు విగ్రహాల ఏర్పాటు విషయమై చర్చ జరిగింది. అంబేడ్కర్ ఒక్కరే రాజ్యాంగం రాయలేదని, ఆయనతో పాటు మరికొందరు రాజ్యాంగ రచనా కమిటీలో ఉన్నారని టీడీపీ కౌన్సిలర్ యరమాటి గంగరాజు చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి. దీనిని ఎస్సీ కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, సతీష్‌తో పాటు మరికొందరు ఖండించారు. గంగరాజు చేసిన వ్యాఖ్యలకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు క్షమాపణ చెప్పడంతో సమస్య సర్దుమణిగింది.

పట్టణంలో పలువురు దేశ నేతల విగ్రహాల ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. వివిధ అంశాలు, సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. 30ఏళ్ల పాటు మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన తన తండ్రి వేగుళ్ల వీర్రాజు విగ్రహం కలువపువ్వు సెంటర్లో ఏర్పాటుపై వస్తున్న ఆరోపణలకు వేగుళ్ల సమాధానం ఇచ్చారు. తన తండ్రి విగ్రహాన్ని అప్పటి ఎమ్మెల్యే సంగిత వెంకటరెడ్డి హయాంలో ప్రజల ఆమోదం మేరకు ఏర్పాటు చేశారని, అప్పట్లో తాను రాజకీయాల్లో లేనన్నారు. సమావేశంలో కమిషనరు బి.రాము, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 14: పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలకు, ముమ్మిడివరం నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు 150 మందికి దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఆర్గనైజేషన్ సభ్యుడు స్టీఫెన్‌బాబు, ఆయన కుటుంబ సభ్యులు వీటిని సమకూర్చారు. అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో టి.నాగరాజారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓఎన్జీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ చైర్మన్ కె.సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అందిస్తున్న సేవలను అభినందించారు. ఎంఈవో బొజ్జా రమణశ్రీ, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సభ్యుడు కె.వెంకటేశ్వరరావు, ఓఎన్జీసీ అధికారి ఎస్.రాజ్‌కుమార్, ప్రసాద్, ఎం.ఆశీర్వాదం, పుల్లెపు వెంకటేశ్వరరావు, డి.రవికుమార్, ఎస్.ప్రసాద్‌కుమార్, ఎన్.ప్రసాద్, ఎం.శివకుమార్, ఎస్.రాంజీ, డి.నాగు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

యానాం, ఫిబ్రవరి 14: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో యానాం నవోదయ విద్యాలయ విద్యార్థులు జోయెల్ ఆకాష్, శివకుమార్, ప్రశాంత్ ప్రతిభ కనపరిచారు. ఏప్రిల్‌లో జరిగే అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించిన వారిని ప్రిన్సిపాల్ అభినందించారు.

మామిడికుదురు: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మండలానికి చెందిన ఇద్దరు సత్తా చాటారు. కాతేరు తిరుమల కళాశాలలో చదువుతున్న మామిడికుదురు గ్రామానికి చెందిన బాలం సాయిదుర్గామహేష్ 99.57 శాతం పర్సంటైల్, అదే గ్రామానికి చెంది శ్రీషిర్డిసాయి కళాశాలలో చదువుతున్న మొల్లేటి తాత్విక్‌సాయి 99.4 పర్సంటైల్ సాధించారు.

ఓడలరేవు పంచనది డ్రెయిన్‌కు గండి



అల్లవరం, ఫిబ్రవరి 14: ఓడలరేవు పంచనది డ్రెయిన్‌కు గండిపడింది. తద్వారా వైనతేయ గోదావరి నీరు ఆటుపోటులకు గ్రామంలోకి వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు ఇబ్బందిగా మారింది. యుద్ధప్రాతిపదికన గండిపూడ్చాలని కోరుతున్నారు.

వంట గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 14: ఉప్పలగుప్తంలో బుధవారం కోలా సత్యవతికి చెందిన పక్కా గృహంలో వంట గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం జరిగింది. గృహోపకరణాలు బూడిదయ్యాయి. ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.


చంద్రబాబుకు ఆహ్వానం అందిస్తున్న భూలక్ష్మి, టీడీపీ నాయకులు

ఆలయ ప్రతిష్ఠకు రండి బాబూ!

పి.గన్నవరం, ఫిబ్రవరి 14: ఈనెల 25న ముంగండలో జరిగే గ్రామ దేవత శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును ఆ పార్టీ నాయకులు ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మితో పాటు పలువురు టీడీపీ నాయకులు బుధవారం చంద్రబాబును మంగళగిరిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానపత్రిక, చిత్రపటం అందించారు. అంబటి కోటేశ్వరరావు, పెచ్చెట్టి వెర్రియ్య, అంబటి సత్యమణికంఠ తదితరులు పాల్గొన్నారు

'ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ద్రాక్షారామ, ఫిబ్రవరి 14: రామచంద్రపురం మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో 2022-23లో నిర్వహించిన పనుల్లో జరిగిన తప్పిదాలు, అవకతవకలకు సంబంధించి రూ.13,764 అపరాధ రుసుం విధించారు. 1,467 పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక సభ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. 25 పంచాయతీల్లో జరిగిన పనులకు రూ.6,20,24,000 వేతనాలు చెల్లించగా రూ.7,77,389 మెటీరియల్ వినియోగించారు. మస్టర్లలో తప్పిదాలు, కొట్టివేతలను సామాజిక తనిఖీ కార్యకర్తలు బహిర్గతపరిచారు. బాధ్యులకు డ్వామా పీడీ అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో ఏపీడీ కె.సత్యనారాయణ, ఎంపీడీవో ఎన్వీవీ రామచంద్రమూర్తి, అంబుడ్స్‌మన్ ఏవీ శ్రీనివాస్, డీవీవో కె.భీమేశ్వర్, ఎస్ఆర్‌పీ సీహెచ్ఎన్ సత్యనారాయణ, ఏపీవో అరుణకుమారి, డీఆర్పీలు, టీఏలు, జేఈ, సీవో పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

మామిడికుదురు, ఫిబ్రవరి 14: పాశర్లపూడిలంకలో వేంచేసియున్న శ్రీవల్లీ దేవ సేన సమేత నాగేంద్రస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజ బుధవారం వైభవంగా జరిగింది.స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష బిల్వార్చన, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన జరిపారు. ఇవన్నీ నాగేంద్రస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

'పోలవరం అసంపూర్తికి కారణం చంద్రబాబే'

రామచంద్రపురం, ఫిబ్రవరి 14: పోలవరం ప్రాజెక్టుకు అంకురార్పణ చేసింది దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి అని, పోలవరం ప్రాజెక్టు అసంపూర్తిగా మిగిలిపోవడానికి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడే కారణమని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి ఆరోపించారు. ప్రసన్న విఘ్నేశ్వర కన్వెన్షన్ హాలులో వైసీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రినాథరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, నాగిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చంద్రగ్రహణం పేరుతో డాక్యుమెంటరీ వేసి చూపించారు. రైతు విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు వాసురెడ్డి మధు, రాష్ట్ర కార్యదర్శి చేబోయిన వీర్రాజు, ఏలూరు జిల్లా పీఏసీఎస్ అధ్యక్షుడు గోకర్ణ యాదవ్, సభ్యులు పాల్గొన్నారు.

సిద్ధివినాయక విగ్రహ ప్రతిష్ఠ

అల్లవరం, ఫిబ్రవరి 14: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అమలాపురం ఎంపీ చింతా అనురాధ అన్నారు. మొగళ్లమూరులోని సిద్ధివినాయక ఆలయంలో 'వైఖానస ఆగమ మహదాచార్య' సుదర్శనం వెంకటజనార్దనాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన విగ్రహ, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠలో ఎంపీ పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ కాండ్రేగుల వెంకటసత్యనారాయణ, జవహర్‌లాల్, రాధాకృష్ణ, నాగేశ్వరరావు దంపతులు కర్తలుగా వ్యవహరించారు.

సర్పంచ్ విష్ణుత్రిమూర్తులు, భక్తులు పాల్గొన్నారు. అల్లవరంలో సీతారామాలయం దశమ సప్తాహ మహోత్సవం సందర్భంగా బండిగుప్తాపు చిట్టివెంకన్న సీతారామలక్ష్మి దంపతులతో పోచనపెద్ది మురళి, పెద్దింటి కృష్ణశాస్త్రి కలశస్థాపన పూజలు చేయించారు.